

కథా కౌముది

# పరిష్కారం

ప్రభవి

"సీతా! సాయంకాలం తొందరగా వచ్చేస్తాను. పిల్లలూ, నువ్వూ రెడీగా ఉండండి. ప్రగతి మైదాన్ ఎగ్జిబిషను చూసొద్దాం" కుర్చీపై కోటు చేతిలోకి హడావిడిగా తీసుకుంటూ అన్నాడు భాస్కర్.

"అబ్బా! ఈ రోజు నాకు నడుము నొప్పిగా ఉంది భాస్కర్. ఇంకో రోజు వెళదాం" అన్నాను భాస్కర్‌కు టిఫిన్ బాక్స్ అందిస్తూ.

"లేదు సీతా, మళ్ళీ నాకు కుదరడం కష్టం. ఈ రోజు పనెక్కువగా లేదు, త్వరగా వచ్చేయగలను. డోన్ట్ బి సిల్లీ ఈ నొప్పులన్నీ ఖాతరు చేయకోయ్! ఉత్సాహంగా ఉండు" నా బుగ్గ మీద చిటికేసి టిఫిన్ డబ్బా అందుకుని భాస్కర్ కారు వైపు నడిచాడు.

ఉస్సురంటూ వంటింట్లోకి నడిచాను నేను. భాస్కర్ జల్సాపురుషుడు. ఎప్పుడూ, ఏదో హడావుడిగా జరుగుతూ ఉండాలి. జీవితం అన్నది ఎంజాయ్ చేయడానికే అన్నది అతని మతం. భాస్కర్‌కు తగ్గపిల్లలు నిత్య, నిర్మల్‌లు. సిటీలో ఒక సినిమా, ఎగ్జిబిషను రాకూడదు, మేము మాత్రం వెళ్ళక తప్పదు. ఈ తిరగడాలు నాకూ సరదాగానే ఉన్నా, పిల్లల్నీ, ఇంటినీ సంబాళించుకోవడం అప్పుడప్పుడు నాకు శక్తికిమించిన పనైపోతుంది. ఏడాది క్రితం భాస్కర్‌కు ఢిల్లీ ట్రాన్స్‌ఫర్ అయినప్పటి నుండీ, వీళ్ళ సరదాలు మరీ ఎక్కువయ్యాయి. సరే తప్పేదేముందీ, అనుకుంటూ వంటింట్లో పనిలోకి చొరపడ్డాను.

ఇంతలో ఫోను చప్పుడు. "అబ్బ! ఈ ఫోనులొకటి, ఏ పనీ తెమలనీయవు" అని విసుక్కుంటూ బైటకి నడిచి, ఫోను అందుకున్నాను.

"హలో! అమ్మా, నేను బాలమ్మను, హైదరాబాదు నుంచి మాట్లాడుతున్నానమ్మా" వినయం ఉట్టిపడుతోంది ఆ గొంతులో.

"ఆఁ! బాలమ్మా, ఏమిటి ఇంత దూరం ఫోన్ చేస్తున్నావు! అంతా బాగేనా?" పలకరించాను.

బాలమ్మ, మేము హైదరాబాదులో ఉండగా, మా ఇంట్లో పనిచేసేది.

"బానే ఉన్నాం కానమ్మా, మీకో విషయం చెబుదామని ఫోన్ చేస్తున్నాను. నాగేందర్ భార్య తెలుసుగా మీకు, కాల్చుకుని చచ్చిపోయిందమ్మా!" బాలమ్మ ఆగింది.

"అరెరే!" అంతకన్నా ఏమనాలో నాకు తోచలేదు. బాలమ్మకు బహుశ సంతోషం కలిగించే ఈ మరణవార్త, నాకు మాత్రం ఎందుకనో వినగానే విషాదం కలిగించింది.

"మరి నాగేందర్ ఎలా ఉన్నాడు? ఏమంటున్నాడు?" అని అడిగాను మెల్లిగా.

"ఆఁ ఏమంటాడమ్మా! ముందుగా పోలీసులు నాగేందర్‌పైనే అనుమానపడ్డారు. ఇప్పుడేం కేసు లేదనుకో. కానీ నన్నే అంటుండమ్మా ఇప్పుడు, నీ వల్లే చచ్చిపోయిందీ అని" బాలమ్మ గొంతులో ధ్వనించింది.

"నువ్వేం చేసావుటా?" ఆశ్చర్యపోతూ అడిగాను నేను.

"నేనేం జేస్తనమ్మా! మీకు తెల్వదా. నాగేందర్ నోటికేదొస్తే, అదే అంటాడు. అమ్మా! ఇంకో విషయం, పోలీసులు ఆ యమ్మ ఇద్దరు పిల్లల్ని నాగేందరే సాకాలని అప్పగించిన్రు"

"మరంతేగదా! తండ్రి కాకపోతే మరెవరు చూస్తారు?" అంటూ నా మాటల్లో నాకే బలం లేనట్లుగా ఆగిపోయాను.

"ఇప్పుడు నా గతేందో మీరే చెప్పండమ్మా!" బాలమ్మ ఏడుస్తున్న చప్పుడు.

బాలమ్మ వ్యధ నాకర్థమైపోయింది.

"గట్టిగా చెప్పు బాలమ్మా! నీకు బాధ్యతేం లేదని, ఆ పిల్లల విషయంలో. నాగేందర్‌ను సంపాదించి తన పిల్లలకు పెట్టుకోమను. ఏంఁ! ఆ మాత్రం చెప్పలేవా" కోపంగా అన్నాను.

"మీకు తెల్వంది ఏముందమ్మా! ఆడి నోటికి, చెయ్యికి హద్దులేదు. ఒక్కమాట మాట్లాడితే, చంపినంత పనిచేస్తాడు" దిగాలుగా అంది బాలమ్మ.

"సరేనమ్మా! మీరు నా బాధ అర్థం చేసుకుంటారని మీకు ఫోన్ జేసిన. నా బతుకు ఇట్లగా నడుస్తుందమ్మా!"

"బాబు, పాప ఢిల్లీల బావున్నారమ్మా?" బాలమ్మ మాటలు ఎటో ఆలోచిస్తున్న నా చెవిలో పూర్తిగా పడలేదు.

"అది కాదు బాలమ్మా! నిన్ను నీవు సమర్థించుకోకపోతే, నీ వాదం నువ్వు నీ భర్తకు వినిపించకపోతే ఎలా? వాడెలా అంటే అలా ఆడే బొమ్మవు కాదుగా నువ్వు. ఇంత పిరికిదానివి కాబట్టే వాడిలా ఆడుతున్నాడు. నువ్విలా ఉంటే నీ జీవితం ఏం బాగుపడుతుంది? ఏమన్నా అంటే ఏడుస్తావు, ఏడిస్తే ఏం సాధించగలవు, వాడింకా తలపైకెక్కి కూర్చుంటాడు" బాలమ్మపై కోపంలో దానికి నేను మాట్లాడేది ఎంత అర్థం అవుతోందో, లేదో కూడా నేను తెలుసుకోలేదు.

బాలమ్మ ఫోను పెట్టేసిన తరువాత కూడా ఆ కుటుంబం గురించిన ఆలోచనలు నన్ను వదలలేదు.

బాలమ్మ భర్త నాగేందర్. ఇద్దరు పిల్లలు, చిన్నవాళ్ళు. నల్లగా ఉన్నా ముద్దులు మూటగడుతూ ఉండేవాళ్ళు. అమ్మ పని చేస్తుంటే, వెనకే తిరుగుతూ ఉండేవాళ్ళు మా ఇంట్లో. వినయంగా, ఒద్దికగా పనిచేసే బాలమ్మంటే నాకు త్వరలోనే మంచి అభిప్రాయం కలిగింది.

బాలమ్మ భర్త నాగేందర్ కూడా అప్పుడప్పుడూ వచ్చేవాడు. ఏదైనా పని చెపితే చేసేవాడు. మంచివాడిలాగే ఉండేవాడు.

"అయితే, నాగేందర్ పనేం చేస్తాడు బాలమ్మా" అనడిగాను ఒకసారి.

"ఏదో కంపెనీలో చేసేవాడమ్మా! ఏడాది నుండీ పనిలేదు. ఇట్లాగే తింటాడు, తిరుగుతాడు, లేకపోతే నా కెందుకీ గతి" అంది బాలమ్మ.

సరే, పాపం ఉద్యోగం పోయింది, ఏదో వెతుక్కుంటూ ఉండి ఉంటాడు అనుకున్నాను. కొన్నాళ్ళ తరువాత ఒకరోజు బట్టలుతుకుతూ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ ఉంటే అడిగాను. భోరున ఏడుస్తూ, బాలమ్మ చెప్పిన వివరమిది.

నాగేందర్ ఇంకో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. ఆ అమ్మాయికి ఇద్దరు పిల్లలు కూడా కలిగారు. బాలమ్మకు ఈ విషయం ఇటీవలే తెలిసింది. అడిగితే నాగేందర్ ఒప్పుకున్నాడు. నీకేం తక్కువ చేస్తున్నానిప్పుడు, నోరు మూసుకోమని బాలమ్మనే బెదిరించాడు.

"అదేమిటి బాలమ్మా, ఇంత జరిగితే నీకు అనుమానమే రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఎప్పుడూ ఇంటికి సక్కంగ వచ్చేవాడే కాదమ్మా! ఏదో దోస్తుల దగ్గరకు పోయిండేమో అనుకున్న కానీ ఇంత పనిజేస్తడనుకోలేదు." వెక్కుతూ అంది బాలమ్మ.

"మరి నీకే తిండి పెట్టలేనివాడు, ఆ అమ్మాయికీ పిల్లలకూ ఏం పెడుతున్నాడు?" అన్నాను.

"ఆమె ఏదో పని చేసి సంపాదిస్తదంటమ్మా! వీడే అక్కడకి పోయి తింటడు" అంది బాలమ్మ.

"నువ్వేమీ అనవా మరి బాలమ్మా? నిలదీసి అడుగు. మీ వాళ్ళందరినీ పిలిచి అడిగించు" అన్నాను కోపంగా.

"అమ్మో! ఆడంటే నాకు బయమమ్మా! మీకు తెల్వదు. చంపినా చంపుతడు. ఇప్పటికి అయ్యిందానికి, కాందానికి, కొట్టిచంపుతున్నడు. నా బతుకు ఇట్లాగే గడుస్తది. ఇగో, నా పిల్లలను జూస్కోని బతుకుతున్న" అంటూ బాధపడింది.

ఇదేం న్యాయం! ఆడది కష్టపడి, సంపాదించి, ఇల్లు, పిల్లల్ని చూసుకుంటూ, వండి వడ్డిస్తూంటే, ఆ వెధవ పనీ పాటా లేకుండా తిరుగుతూ ఇంకో ఆడదాన్ని కూడా ఉద్ధరించాడు. అదేమని పైకి అడగటానికి కూడా లేదా! తరతరాల నుంచీ స్త్రీకి అన్యాయమే జరుగుతోంది. ఇలా ఎంతకాలం?

భాస్కర్‌కు చెపితే "సర్లేవోయ్! వీడిపనే బాగుంది. పనీపాటా లేదు, హాయిగా ఇద్దరు భార్యలు" అని నిట్టూర్చాడు.

"అదిగో భాస్కర్! మగబుద్ధిపోనిచ్చుకున్నావు కాదు" అని రుసరుసలాడాను.

"అబ్బే! ఊరికేనోయ్! నువ్వేమంటావో అని జోక్ చేసాను. ఈ జన్మకు నువ్వుచాలు నాకు" అని కాకా పట్టటం మొదలుపెట్టాడు.

ఆ తరువాత, అప్పుడప్పుడూ, తన వ్యథ చెప్పుకుంటూ ఉండేది బాలమ్మ. విని బాధపడ్డా, వాళ్ళ సంసారం విషయంలో ఏం చేయలేకపోయాను.

ఏడాది క్రితం భాస్కర్‌కు ఢిల్లీ బదిలీ అయిన తరువాత, జీవితం మరో మలుపు తిరిగింది. ఆ తరువాత బాలమ్మ ఎలా ఉందో తెలీదు.

ఇప్పుడ్ మళ్ళీ ఫోను. నాగేందర్ రెండో - భార్య మరణించింది. అదీ కాల్చుకుని. ఈ మహరాజు ఏం చేసాడో మరి. ఇప్పుడు ఆ పిల్లలిద్దర్నీ కూడా తెచ్చి బాలమ్మకు అంటగడతాడు. నడుములు ఇంకొంచెం వంచి బాలమ్మ నలుగురు పిల్లల్నీ పోషించాలి. ఏం మనుషులు? ఎవరి కష్టాలు ఎవరు తీర్చగలరు?

స్కూలు నుండి వచ్చిన పిల్లల కేకలు ఆలోచనల్లో ఉన్న నన్ను మళ్ళీ ప్రపంచంలోకి తెచ్చాయి.

"మమ్మీ! అన్నం పెట్టేయ్. డాడీ, మూడింటికి బైలుదేరదామన్నారు" అంటూ పిల్లలు హడావుడి చేస్తూంటే, ఇక లేచాను.

●●●

భాస్కర్‌ను, పిల్లలను పంపించి, అలాగే పక్కపై జారిపోయాను. ఎగ్జిబిషను అంటే ఏదో మామూలుదే, అనుకున్నాను. కానీ ప్రగతి మైదాన్ .. ఎంత పెద్దదో, చూసాక తెలిసొచ్చింది. నడుము నొప్పి ముందే ఉందేమో, నడిచేప్పటికి మరీ ఎక్కువైంది. పెయిన్ కిల్లర్ వేసుకుని, పక్కపై వాలిపోయాను. ఇల్లు ఊడుస్తూ, గదిలోకి వచ్చిన పనమ్మాయి తలెత్తి నన్ను చూసింది.

"జునా" నేపాలీ అమ్మాయి. తెల్లగా, పొట్టిగా, చీపురు కళ్ళు, చప్పిడీ ముక్కు - ఫక్తు నేపాలీ అమ్మాయి.

"వంట్లో బాగోలేదా అమ్మా!? హిందీలో అడిగింది.

"ఔను జునా! నడుం నొప్పిగా ఉంది" అన్నాను నడుం రాసుకుంటూ.

"అయ్యో! ఉండండి.. నేను గబగబా ఇల్లు శుభ్రం చేసి, మీకు మాలిష్ చేస్తాను. చప్పున తగ్గిపోతుంది" అంటూ గబగబా ఊడవడం మొదలు పెట్టింది.

దాన్నే చూస్తూ ఆలోచించసాగాను. జునూ మంచమ్మాయి. ఒకసారి అడిగాను జునూ అంటే ఏమిటని. నేపాలీ భాషలో జునూ అంటే నక్షత్రమంట. పుట్టినప్పుడు చిన్నగా, తెల్లగా ఉండడంతో అలా పేరు పెట్టారంట.

ఎప్పుడు చూసినా ఆనందమే తానైనట్టు, నవ్వుతూ, తుళ్ళుతూ ఉంటుంది. ఇరవై నాలుగేళ్ళకే, తొమ్మిది, ఆరు సంవత్సరాల ఇద్దరు అబ్బాయిలు తెల్లగా ముద్దుగా ఉంటారు. భర్త ఎక్కడో కిరాణాషాపులో పనిచేస్తాడట.

పని ముగించుకుని వచ్చి, ఆవనూనెతో మాలిషు చేయడం మొదలు పెట్టింది. ఆ చలిలో, వేడి ఆవనూనె మాలిష్ నాకు వెచ్చగా, హాయిగా అనిపించసాగింది.

"జునూ?"

"చెప్పండి మేంసాబ్"

"నువ్వలా రాస్తుంటే, చాలా హాయిగా ఉంది. థాంక్స్ జునూ"

"అయ్యో! ఫరవాలేదు మేం సాబ్! ఇదంత పెద్దవిషయమేం కాదు"

కొద్దిక్షణాలు మౌనంగా మాలిష్ నడిచింది.

"మేం సాబ్! మీతో ఎప్పటినుంచో ఒక విషయం చెబుదామనుకుంటున్నాను"

"చెప్పు జునూ"

"తాగుడు అలవాటు మానిపించే సెంటర్లు ఉంటాయట కదా, వాటి వివరాలు నాకు చెప్పగలవా?"

నా మనసులో ఏదో అనుమానం.

"ఔను మేం సాబ్! మా ఆయనకు తాగుడు అలవాటు ఎక్కువౌతోంది. ఎంత చెప్పినా వినడు." జునూ గొంతులో బాధ.

దేశంలో ఎక్కడ తిరిగినా, ఆడదాని కథ ఇంతేనన్నమాట అనుకున్నాను.

"మొన్నటికి మొన్న స్నేహితుడిని రైల్వే స్టేషనులో దింపుదామని వెళ్ళి, అక్కడ ఇద్దరూ తాగుతుంటే, పోలీసులు పట్టుకుని ఠాణాలో పెట్టారు. కష్టపడి విడిపించుకున్నాం. వీడి తాగుడు బంద్ అయితేగానీ, నా జీవితం బాగుపడదని తేలిపోయింది. అందుకే మిమ్మల్ని అడుగుతున్నాను."

"అది సరే కానీ జునూ, మీ ఆయన నిన్నూ పిల్లల్నీ ప్రేమగానే చూసుకుంటాడా?" బాలమ్మ పిల్లల్ని చేరదీయని నాగేందర్ నాకెందుకో గుర్తొచ్చాడు.

"అబ్బో! చాలా ప్రేమ మేం సాబ్. వాళ్ళు ఏది అడిగితే అది తెస్తాడు. రోజూ ఇంటికి రాగానే ముద్దులతో వాళ్ళను ముంచెత్తుతాడు" జునూ మొహంలో నవ్వు మెరిసింది.

కుమార్ చాలా మంచివాడు. "పోనీలే జునూ కుమార్ చాలా మంచివాడు. మా హైదరాబాదులో బాలమ్మ మొగుడు నాగేందర్..." అంటూ చెప్పుకొచ్చాను.

"అలాంటి పనిచేసాడంటే మాత్రం నా చేతిలో చచ్చాడే" అంది క్రోధం నిండిన కళ్ళతో.

"మీకు తెలుసా! ఒకసారి కుమార్ కూడా ఇంకో అమ్మాయిని తెచ్చిపెట్టుకున్నాడు వేరే ఇంట్లో. నాకు తెలిసిందే తడవుగా అక్కడికి వెళ్ళాను. కర్ర తీసుకుని ఆ ఆడదాన్ని ఎంత కొట్టానంటే, అది పారిపోయి మళ్ళీ నా కంటికి కనిపించలేదు. ఇక కుమార్ నైతే కత్తితో పొడవబోయాను. వణికిపోయి, నాకాళ్ళపై పడి, మళ్ళీ ఎప్పుడూ ఇలాంటి పని చేయనని వేడుకున్నాడు. అప్పట్నుంచీ బానే ఉన్నాడు. ఈ తాగుడేనమ్మా. అది అతడి బలహీనతని నాకు తెలుసు. అందుకే గట్టిగా చెప్పలేకపోతున్నాను. ఏదైనా సెంటర్లో పెడితే మారతాడేమో అని.." జునూ చెప్పుకుంటూ పోతోంది.

ఛటాలున నాకు జ్ఞానోదయం కలిగినట్లు అనిపించింది. స్త్రీ సమస్యలకు పరిష్కారం ఎక్కడుందో తెలిసిపోయింది. "హోగయా! అద్ కైసా లగ్‌రా హై?"

ఆత్మ విశ్వాసంతో, ఉత్సాహంతో మాట్లాడుతున్న జునూను అలాగే చూస్తూండిపోయాను.

●●●

*రచయిత్రి పూర్తి పేరు:* కిళాంబి విజయలక్ష్మి

తల్లిదండ్రులు శ్రీ వింజమూర్ గోపాలాచార్యులు, శ్రీమతి కమల. భర్త కె.మధుసూదన్ రైల్వేలో ఛీఫ్ ఇంజినీర్. ఇద్దరు పిల్లలు భావన, ప్రణవ్ విద్యార్థి దశలో ఉన్నారు.

*ప్రస్తుతం:* కేంద్రీయ విద్యాలయాలకు డెప్యూటీ కమీషనర్ గా ఢిల్లీలో నివాసం.

బాల్యం నుండి పెంపొందిన పఠనాసక్తి, దాదాపుగా అందరి రచనలని చదివింపచేసినా మధురాంతకం రాజారాం గారి కథలు, ముళ్ళపూడి గారి సెటైర్, నండూరి రామ్మోహనరావు గారి వైజ్ఞానిక, వేదాంత గ్రంథాలు మరీ మరీ ఇష్టం. ప్రతి జీవితంలోనూ మెలోడ్రామా ఉంది. సామాన్యంగా కన్పించే సంఘటనల్లోనూ ఆలోచనలను ప్రభావింపచేసే శక్తి ఉంది. అలా ఎదురైన సంఘటనలని, వ్యక్తులను కథా రూపంలో మలిచి అందరితో పంచుకోవాలన్న ఉబలాటమే ఈ చిన్ని ప్రయత్నానికి స్ఫూర్తి.

**Click here to share your comments on this story**